

# పసిడిమనసులు - షర్మిల



## నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!

# మన్నాన మనసు

చెప్పాగా ! చిన్నప్పుడు నా పెంపకం అంతా తాతా, నాయనమ్మలదేనని. తాతగారింట్లో నేను నెలల పిల్లగా పాకుతున్నప్పుడు మా మన్నాన్నకు చేరికయ్యానంట. మాన్నాన్న అంటే మన నాన్న అని అర్ధం. చిన్నప్పుడు నాకు ఎందుకో అలాపిలవడం అలవాటైపోయింది. ఆయనకి 40 ఏళ్లొచ్చినా పిల్లలు లేరు. తాతకి మన్నాన్న వరసకి కొడుకైనా ఇద్దరికీ వయసు తేడా పెద్దగా లేదు. ఎంతో స్నేహంగా వుండే వారు, ఇద్దరూ కలిసే వ్యవసాయం చేసేవారు. దీనితో రెండు కుటుంబాలూ సఖ్యంగా వుండే వారు. మా పెద్దమ్మ కూడా నన్ను ముద్దుగా చూసేది. నాకు నాలుగేళ్లప్పుడు మన్నాన్నకి కొడుకు పుట్టాడు.

" అమ్మడూ నిన్ను పెంచుకున్న వేళావిశేషమే " అని అంతా అనే వారు.

మా మన్నానే అంతా అయి నన్ను పెంచాడు. పొద్దున్నే పొలం నుంచి రావటం ఆలస్యం

" అమ్మడూ ! పద" అని ఇంటికి తీసుకుపోయేవాడు.

అయనా స్నానం చెసి భోజనానికి కుర్చీలో కూర్చునేవాడు, నన్ను ఆ బల్ల మేద కూర్చొబెట్టుకుని పప్పువేసి గుంట చేసి దాన్నిండా నెయ్యి పోసి ముద్దలో కలిపి దాన్ని మళ్లీ నెయ్యిలో ముంచి తినిపించేవాడు.

పెద్దమ్మ " నువ్వు తినూ ! దానికి నేను పెడతాగా" అనేది.

కానీ వినిపించుకుంటేగా! రెండేళ్లు నిండగానే ఆచార్లు గారి అరుగు బడికి చదువుకోమని పంపించి

" ఇదుగో ఆచార్లు గారూ! మ అమ్మ వంటిమీద దెబ్బ పడకూడదంతే " అని చెప్పి మరీ వెళ్లేవాడు.

రోజూ రాత్రి పనులు చూసుకుని ఇంటికెళ్తూ వచ్చి పడుకున్న నన్ను లేపి మరీ జిలేబీ నో బందరు హల్వానో తినిపించేవాడు.

మా తాత ఇదంతా చూసి " ఒరే ! గారాబం చేసి దాన్ని పాడు చేస్తున్నావు రా ఒకింటికి ఎళ్లాల్సిన పిల్ల కష్టం ఏంటో తెలిసేటట్టు పెంచాలిరా " అనేవారు.

" ఏంటి బాబాయ్ నువ్వు ఏమనుకుంటన్నావ్ ... నా తల్లి అత్తారి ఇంటి నుంచి నాన్నా అని పిలిస్తే అమ్మా అని పొలిమేరలో నుంచుని పలికేంత దూరంలో ఇవ్వనూ ... " అనేవాడు.

కణ్వ మహర్షి శకుంతలను పెంచినట్టు పెంచుకుంటున్నా అని కన్నీళ్లు పెట్టుకునేవాడు. కన్నప్రేమ కన్నా పెంచిన ప్రేమ గొప్పదంటూ వూరిజనం మమ్మల్ని చూసి అనుకునేవారు. నాకు 10ఏళ్లు నిండేవరకు మావూర్లోనే వున్నా. మా అమ్మా,నాన్నా విశాఖపట్నంలో వుండాలని నిర్ణయించుకుని నన్ను, తమ్ముడిని తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అప్పుడు మన్నాన్న అమ్మడిని ఇక్కడే వుంచమని బతిమాలాడు. పట్నం మోజులో నేను కూడా వెళ్లిపోతానని అన్నప్పుడు నిజంగానే శకుంతలను అత్తారింటికి పంపే కణ్వ మహర్షిలాగానే ఏడ్చాడు.

" నిన్ను బందర్లో పెట్టి లాయర్ని చేస్తా వుండమ్మా " అని బస్ వరకూ వచ్చి బతిమాలాడు.

ఏళ్లు గడిచి పోయాయి ... మన్నాన్నకి మనవలు కుడా పుట్టారు. నాకూ బాధ్యతలు పెరిగాయి. వయసుమీద పడినా ఆరోగ్యంగానే

వుండే మన్నాన్నకి వున్నట్టుండి  సీరియస్ అయ్యిందని ఫోన్ వచ్చింది. బెజవాడ ఆసుపత్రికి తీసుకువచ్చారని అక్కడికి పరిగెత్తుకుని వెళ్లాను. మంచం మీద మన్నాన్న కోమాలో పడివున్నాడు.

"నాన్నా!" అంటూ చెయ్యి పట్టుకున్నాను.

"అమ్మడూ ఆయన మనలో లేరమ్మా " అని పెద్దమ్మ ఏడ్చింది. కానీ నా చేతి మీద రెండు కన్నీటి బొట్లు రాలాయి.

మన్నాన శరీరంలో ఏ అవయవాలూ పనిచేయకపోయినా మనసు మాత్రం అన్నీ గ్రహిస్తూనేవుంది. కాసేపటికే లోకాన్ని విడిచాడు మన్నాన్న. ఆఖరిగా మన్నాన్న ఏం చెప్పాడో విని మళ్లీ జన్మ వుంటే ఆయన కూతురుగా పుట్టాలని... అది నా బాధ్యతని అనిపించింది.

ఆసుపత్రికి తీసుకెళ్లాక ఇంచుమించు కోమాలోకి జారిపోతున్న ఆయన్ని డాక్టర్ " మీకు పిల్లలు ఎందరు ? అని అడిగితే

" ఇద్దరు" అని గొణుగుతూ రెండు వేళ్లు చూపించాడంట, అవే మా మన్నాన్న ఆఖరి మాటలు !!!

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

***COMMENTS***